# నేడు వేములవాడ బంద్

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
బుధవారం 14 మే 2025 హైదరాబాద్ 5

- వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొనాలి
- రాజన్న ఆలయ రక్షక కమిటీ పిలుపు
- ఆలయం వద్దనున్న దర్గాను తొలగించాలని డిమాండ్
- బంద్‌కు అఖిలపక్ష నేతల మద్దతు



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధి పేరుతో జూన్ 15 నుంచి రాజన్న ఆలయాన్ని మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం రాజన్న ఆలయ రక్షక కమిటీ వేములవాడ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చింది. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేయాలని కోరింది. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సహా అన్ని పార్టీల నాయకులతో కలిసి 'రాజన్న ఆలయ రక్షక కమిటీ'ని ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా రాబోయే రెండేళ్ల పాటు ఆలయాన్ని మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రాజన్న ఆలయ రక్షక కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో రెండేళ్ల పాటు రాజన్న ఆలయాన్ని మూసివేయాలనుకోవడం దుర్మార్గమని విమర్శించారు. వేములవాడ రాజన్న అభివృద్ధి పేరుతో పరివార్ దేవతామూర్తుల (హిందూ) విగ్రహాలను తొలగించడాన్ని వ్యతిరేకించారు. రాజన్న ఆలయం వద్దనున్న దర్గాను వెంటనే తొలగించాలని రాజన్న భక్తులంతా ముక్త కంఠంతో కోరుతున్నా పట్టించుకోని అధికారులు ఆలయాన్ని మూసివేయాలనుకోవడం విడ్డూరమన్నారు. సర్కార్ నిర్ణయాన్ని నిరసిస్తూ నేడు చేపట్టబోయే వేములవాడ బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వ్యాపారులంతా స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేయాలని పునరుద్ఘాటించారు.

## రాజన్న ఆలయ విస్తీర్ణం విషయంలో

# అపోహాలు వద్దు

ఆలయ అధికారులు, అర్చక బృందం



**ప్రజానావ, వేములవాడ:** 'దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి నిత్యం వేలాది మంది భక్తులు వచ్చి దర్శించుకుంటున్నారని, ప్రస్తుతం ఉన్న విస్తీర్ణంతో భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందజేయలేకపోతున్నాం. ఈ మేరకు ఆలయ విస్తీర్ణం పెంచాలనే చర్యలు ప్రభుత్వం ద్వారా కొనసాగుతున్నాయి' అని ఆలయ అధికారులు, అర్చక బృందం పేర్కొంది. మంగళవారం దేవస్థానం ఓపెన్ స్లాబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ జూన్ 15 నుంచి దేవస్థానం మూసివేస్తున్నట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. ప్రధాన ఆలయ విస్తీర్ణం.. భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శన సౌకర్యానికి సంబంధించిన వివరాలను అతి త్వరలో వెల్లడిస్తామని, భీమేశ్వర ఆలయంలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేసిన తర్వాతే ప్రధాన ఆలయ విస్తీర్ణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.

### ఆలయం మూసివేత ఉండదు

శృంగేరి పీఠాధిపతి అనుమతులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ సలహాలు సూచనలు మేరకు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రధానాలయాన్ని ఆగమశాస్త్ర బద్ధంగా విస్తీర్ణం పెంచబోతున్నామని, విధివిధానాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. ఆలయం మూసివేయడం అంటూ ఏది ఉండదని, ఆలయం అభివృద్ధి చేసేటప్పుడు పూర్తిస్థాయిలో స్వామివారికి నిత్య కైంకర్యాలు ఉంటాయని, ఆలయ అభివృద్ధి విషయంలో అధికారిక ప్రకటన జారీ చేసేవరకు భక్తులు ఆందోళనకు గురికావొద్దని తెలిపారు. ఆలయ పనులకయ్యే ఖర్చు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.76 కోట్లతోనే జరుగుతుందని, రూ.36 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం జరుగుతాయని స్పష్టం చేశారు. దేవస్థానానికి భక్తుల ద్వారా సమర్పించిన డబ్బులేవీ ఇందుకు ఉపయోగించట్లేదని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారితో పాటు ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ రాజేష్, ప్రధానార్చకులు, ఇన్‌చార్జి స్థానాచార్యులు ఉమేశ్, ఉప ప్రధాన అర్చకుడు శరత్ పాల్గొన్నారు.

# నేటి బంద్‌కు సహకరించొద్దు

యథావిధిగా షాపులు తెరుచుకోవచ్చు

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణంలో మెయిన్ బుధవారం బీజేపీ, బీఆర్ఎస్ బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బంద్‌కు వాణిజ్య, వ్యాపారస్తులు సహకరించొద్దని, యథావిధిగా వ్యాపారులు షాపులు తెరుచుకోవచ్చని మంగళవారం కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి చేస్తే ఓర్వకుండా ప్రతిపక్ష నేతలు ఆడుతున్న నాటకాన్ని ప్రజలు గమనించాలని వారు కోరారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వేములవాడ పట్టణంతో పాటు రాజన్న ఆలయాన్ని విస్తీర్ణం చేస్తామంటే ఎక్కడ బీసీ బిడ్డకు పేరొస్తుందోనని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఓర్వకుండా ఈ బంద్‌ను తెరమీదకు తెచ్చారని, ప్రజలు, మేధావులు గమనించి ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు. విప్ నాయకత్వంలో రానున్న రోజుల్లో వేములవాడ రాజన్న ఆలయాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయడమే మా లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేశ్, పుల్కం రాజు, జడల శ్రీనివాస్, నాగుల విష్ణు, బొందిల మహేశ్, ముప్పిడి శ్రీధర్, అంబటి చంద్రశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పీఠాధిపతుల సలహా మేరకే

# ఆలయ అభివృద్ధి

భక్తుల సంఖ్య పెరగడంతోనే విస్తరిస్తున్నాం

గర్భగుడిలో నిత్యం పూజలు కొనసాగుతాయి

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజానావ, వేములవాడ:** శృంగేరి పీఠాధిపతుల సలహాలు, సూచనల మేరకే రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన వేములవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆలయాన్ని విస్తరిస్తున్నామని, వచ్చే భక్తులకు శ్రీఘ్ర దర్శనాన్ని కల్పించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నట్లు చెప్పారు. ఆలయాన్ని బంద్ చేసి విస్తీర్ణ పనులు చేయబోమని, గర్భగుడిలో నిత్యం పూజలు జరుగుతాయని స్పష్టం చేశారు. భక్తులకు భీమేశ్వరాలయంలో దర్శనాలు కల్పిస్తున్నామని తెలిపారు. దశాబ్ది కాలంగా వెనుకబడిన ఆలయ అభివృద్ధిని మేం చేస్తుంటే కొందరు వ్యక్తులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజలు, నాయకులు, అనువంశికుల సూచనలను పరిగణలోనికి తీసుకొనే ఈ విషయంలో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఒకరిద్దరూ విమర్శించినా వారిని అనుకూల దృక్పథంలోనే చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయం కేవలం విస్తరణ మాత్రమే చేస్తున్నామని విప్ పునరుద్ఘటించారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**ప్రజానావ, బెల్లంపల్లి:** కాసిపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 61 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి రూ.6,06,960ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి అమ్మాయి వివాహానికి కుటుంబ సభ్యులు తీవ్రంగా శ్రమిస్తారని, వారికి బాసటగా ఉండడానికి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు ,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్




**ప్రజానావ, రెబ్బెన :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రెబ్బెన మండల కేంద్రంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ ఈనెల 20 తేదీన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని అన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాల నుంచి 29 కార్మిక చట్టాలను విడదీసి నాలుగు లేబర్ కోడ్ లుగా చేశారని అన్నారు. కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ లకు అమ్ముడుపోయిందని ఆరోపించారు.కార్మిక వర్గాన్ని కార్పొరేట్లకు కట్టు బానిసలుగా తయారు చేయాలని బిజెపి ప్రభుత్వం చూస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రవేటికలను వెంటనే ఆపివేయాలని, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ , థర్డ్ పార్టీ కార్మికులను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దుచేసి,జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ ( ఏఐటీయూసీ) మండల అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి దేవాజీ,నాయకులు శంకర్,ప్రవీణ్, నర్సయ్య, లక్ష్మి, కమల తదితరులు పాల్గొన్నారు.

